ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 18.12.2025 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. ఉప రాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్ ఈనెల 20, 21 తేదీలలో హైదరాబాద్ లో పర్యటిస్తారు.

2. దేశంలో 136 గనులను వేలం వేయడం ద్వారా వివిధ రాష్ట్రాలకు 43 వేల కోట్ల పైచిలుకు ఆదాయం, 4 లక్షల మందికి పైగా ఉపాధి లభించిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చెప్పారు.

3. రాష్ట్రంలో నాలుగు రోజుల పాటు చలి తీవ్రత పెరిగే అవకాశం ఉందని వాతావరణ విభాగం వెల్లడించింది.

4. ఈరోజు అంతర్జాతీయ వలసదారుల దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటున్నారు.

**ఉప రాష్ట్రపతి**

ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ఈనెల 20 , 21 తేదీల్లో హైదరాబాద్‌లో పర్యటి స్తారు. 20వ తేదీన శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకుని అక్కడి నుంచి నేరుగా రామోజీ ఫిల్మ్‌సిటీకి వెళ్తారు. అక్కడ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ల జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం ఆ రోజు రాత్రి లోక్‌భవన్‌లో బస చేస్తారు. 21న ఉదయం రంగారెడ్డి జిల్లాలోని కన్హా శాంతివనంలో ఏర్పాటు చేసిన ప్రపంచ ధ్యాన దినోత్సవంలో పాల్గొంటారు. అనంతరం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకుని ఢిల్లీకి బయలుదేరి వెళ్తారు. ఉప రాష్ట్రపతి

పర్యటన ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు నిన్న ఉన్నతాధికారులతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.

జీఎస్

**కిషన్ రెడ్డి**

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన బొగ్గు , గనుల వేలం విధానం ద్వారా ఇప్పటివరకు 136 గనులను విజయవంతంగా వేలం వేసినట్లు కేంద్ర బొగ్గు , గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి చెప్పారు. దీని ద్వారా రాష్ట్రాలకు 43 వేల 330 కోట్ల ఆదాయం వచ్చిందని , 4 లక్షల మందికి పైగా ఉపాధి అవకాశాలు లభించాయని తెలిపారు. నిన్న ఢిల్లీలో జరిగిన 'ఫ్యూచర్ కోల్ ' ఇండియా ఛాప్టర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కిషన్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. గడిచిన కొన్నేళ్లలో బొగ్గు రంగంలో అనేక మార్పులు తీసుకొచ్చామని , దీనివల్ల దేశంలో బొగ్గు ఉత్పత్తి 565 మిలియన్ టన్నుల నుంచి 1 బిలియన్ టన్నులకు చేరిందని చెప్పారు. తొలిసారిగా దేశంలో బొగ్గు నిల్వలు 50 మిలియన్ టన్నులు దాటాయన్నారు. బొగ్గు వాయువీకరణ ద్వారా ఎరువులు , రసాయనాలు, మిథనాల్, హైడ్రోజన్, సింథటిక్ గ్యాస్ వంటివి ఉత్పత్తి చేయొచ్చని, దీనివల్ల దేశీయ పరిశ్రమలు బలోపేతం అవుతాయని.. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం 8 వేల 500 కోట్ల రూపాయలతో ప్రోత్సాహక పథకాన్ని తీసుకొచ్చిందని కిషన్ రెడ్డి అన్నారు.

జీఎస్

**పొన్నం**

హుస్నాబాద్ లో ఈ ఉదయం రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించారు. స్థానిక నాయకులు , కార్యకర్తలతో కలిసి బైక్ నడుపుతూ మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి పరిశీలించారు. అంబేద్కర్ భవన్ ను పరిశీలించి , అక్కడ జరుగుతున్న సీసీ రోడ్లు , డ్రైనేజీ పనులను పర్యవేక్షించారు. మున్సిపల్ కమిషనర్ , ఇతర

అధికారులకు పలు సూచనలు చేశారు.  ఇంకా పట్టణంలో ఎక్కడెక్కడ రోడ్లు , డ్రైనేజీ పనులు అవసరమున్నాయో ఆరా తీశారు.

పిటిసి, సిద్దిపేట

**ర్యాలీ**

హైదరాబాద్ లోని గాంధీ భవన్ నుంచి ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ రాష్ట్ర ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతలు కొద్ది  సేపటి క్రితం బీజేపీ కార్యాలయానికి ర్యాలీగా బయలు దేరి వెళ్లారు. కాంగ్రెస్ పార్టీ నేతలపై కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం అక్రమంగా కేసులు పెడుతోందని ఆరోపిస్తూ..      . ఈ ర్యాలీ చేపట్టారు. అయితే      , పోలీసులు ఈ ర్యాలీని అడ్డుకున్నారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ సందర్భంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

డెస్క్

**పొడిగింపు**

పీజీ వైద్యవిద్యలో ప్రవేశానికి  మొదటి దశ కౌన్సెలింగ్‌కు సంబంధించి కన్వీనర్ కోటాలో సీట్లు పొందిన విద్యార్థులకు.. రిపోర్టింగ్ గడువు డిసెంబరు 18 వరకు ఉండగా... దాన్ని డిసెంబరు 21వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు పొడిగించినట్లు కాళోజీ వైద్య విశ్వ విద్యాలయం నిన్న  వెల్లడించింది.  అన్ని వైద్య కళాశాలల ప్రిన్సిపాల్‌లు రిపోర్టింగ్ అభ్యర్థి డేటాను ఈనెల 21న సాయంత్రం నాలుగున్నర గంటలలోపు యూనివర్సిటీ పోర్టల్‌కు అప్‌లోడ్ చేయాలని పేర్కొంది.

పిటిసి, సంగారెడ్డి

**ప్రమాదం**

ఆసిఫాబాద్ జిల్లా పరంధోలి గ్రామంలోని ఘాట్ రోడ్డు వద్ద ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురై ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఆదిలాబాద్ నుండి పరంధోలి

వస్తున్న ఆర్టీసీ బస్సు బ్రేకులు ఫెయిల్ అవడంతో అప్రమత్తమైన డ్రైవర్ బస్సును పక్కనే ఉన్న పంట పొలాల్లోకి తీసుకు వెళ్లాడు. దీంతో , ఘాట్ రోడ్డు వద్ద పెద్ద ప్రమాదం తప్పింది. ఈ సంఘటనలో ఒకరికి తీవ్ర గాయాలు కాగా ఆదిలాబాద్ ఆసుపత్రికి తరలించారు. బస్సులో ఉన్న మిగతా వారికి స్వల్ప గాయాలయ్యాయి.

పిటిసి, ఆసిఫాబాద్

**కోతులు**

పంచాయతీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన మాటను రాజన్న సిరిసిల్ల జిల్లా కందికట్కూరు గ్రామ సర్పంచ్ వెనువెంటనే నిలబెట్టుకున్నారు. గ్రామంలో కోతుల బెడద ఎక్కువగా ఉండటంతో.. సర్పంచ్ చింతలపల్లి విజయమ్మ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గెలవగానే .. కోతులు పట్టేవాళ్లను రప్పించి కోతులను పట్టిస్తున్నారు. ఈ పరిణామంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తూ...

బైట్ - గ్రామస్తుడు

పిటిసి, సిరిసిల్ల

**కరీంనగర్**

మూడు దశల్లో పంచాయతీ ఎన్నికల ప్రక్రియ మొత్తాన్ని విజయవంతంగా పూర్తిచేసిన మొదటి జిల్లాగా కరీంనగర్ నిలిచిందని సోషల్ మీడియా వేదికగా రాష్ట్ర ఎన్నికల సంఘం పేర్కొంది. మూడు దశల్లో అన్ని జిల్లాల కంటే ముందుగా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసిన జిల్లాగా కరీంనగర్ నిలిచి నందుకు గాను జిల్లా కలెక్టర్ తో బాటు ఎన్నికల యంత్రాంగాన్ని రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రశంసించింది. ఎన్నికలు విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన అధికారులు, పోలింగ్ సిబ్బందికి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అభినందనలు తెలిపారు.

పిటిసి, కరీంనగర్

**కుష్టు**

మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా ఈరోజు నుండి ఈ నెల 31 వరకు కుష్ఠు వ్యాధి గ్రస్థుల నిర్ధారణ కోసం 650 బృందాలతో సర్వే చేపడు తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి అనిత ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో సంబంధిత ప్రచార ప్రతులను ఆవిష్కరించారు. ఈ వ్యాధిపై అవగాహన కల్పిస్తూ , అనుమానితుల నుంచి నమూనాలు సేకరించనున్నట్లు చెప్పారు.

పిటిసి, మంచిర్యాల

**ఇంటింటి సర్వే**

ఇంటింటి సర్వే ద్వారా కుష్టు వ్యాధి గ్రస్తులను ముందుగానే గుర్తించి చికిత్స అందించడం ద్వారా అంగవైకల్యాన్ని నివారించవచ్చునని మహబూబాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్ అన్నారు. ఈరోజు నుంచి ఈనెల 31వ తేదీ వరకు నిర్వహించే కుష్టు వ్యాధి కేసుల గుర్తింపు కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు ఇంటింటి సర్వే నిర్వహించినప్పుడు మార్గదర్శకాలు పాటించాలన్నారు. కేసును గుర్తిస్తే పూర్తి కాలం చికిత్స తీసుకునేలా ఆశా కార్యకర్తలు ప్రజలను ప్రోత్సహించాలని పేర్కొన్నారు.

పిటిసి, మహబూబాబాద్

**ఇంటింటి సర్వే**

జగిత్యాల జిల్లాలో కుష్టు వ్యాధితో బాధపడుతున్న వారి వివరాల సేకరణకు ఈరోజు నుంచి ఈనెల 31 వరకు ఇంటింటి సర్వే నిర్వ హిస్తామని జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎన్. శ్రీనివాస్ తెలిపారు. ఆకాశవాణితో ఆయన మాట్లాడుతూ...

బైట్ - శ్రీనివాస్

పిటిసి, జగిత్యాల

**చలి**

శీతల గాలుల ప్రభావంతో రాష్ట్రంలో ఈరోజు నుంచి నాలుగు రోజుల పాటు.. చలి తీవ్రత మరింత పెరుగుతుందని వాతావరణ విభాగం అధికారులు తెలిపారు. ఇప్పటికే కొన్ని జిల్లాల్లో సింగిల్

డిజిట్ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా పక్షం రోజుల నుంచి వరుసగా సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలే నమోదవుతున్నాయి.

పీఎస్

**దినోత్సవం**

ఈరోజు అంతర్జాతీయ వలసదారుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రజలు తమ స్వస్థలాలను వదిలి వెళ్లేటప్పుడు ఎదుర్కొనే సవాళ్లను , వారి హక్కులను , భద్రతను, గౌరవాన్ని, సమాజాలకు వారు చేసే సానుకూల కృషిని తెలియజేయడానికి ఐక్యరాజ్యసమితి దీనిని నిర్ణయించింది. ఈరోజు సురక్షితమైన , క్రమబద్ధమైన, క్రమమైన వలసల ఆవశ్యకతను నొక్కి చెబుతారు. 2000వ సంవత్సరంలో ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ దీనిని ప్రకటించింది. వలసదారుల హక్కులు , వారి సహకారం , వారు ఎదుర్కొనే ఇబ్బందులపై అవగాహన కల్పించడం ఈ రోజు ప్రధాన ఉద్దేశ్యం.

జీఎస్

**గెలుపు**

కేంద్ర బొగ్గు , గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి స్వగ్రామమైన రంగారెడ్డి జిల్లాలోని కందుకూరు మండలం తిమ్మాపూర్‌లో బీజేపీ మద్దతుదారు గానుగపాట అంజమ్మ సర్పంచిగా గెలుపొందారు. ఆమె విజయం సాధించడంపై కిషన్‌రెడ్డి ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు.

డెస్క్

**వరంగల్**

వరంగల్ జిల్లాలో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో 316 పంచాయతీలకు గాను 199 మంది కాంగ్రెస్ మద్దతు దారులు , 104 మంది బి ఆర్ ఎస్ మద్దతు దారులు , నలుగురు బిజెపి మద్దతు దారులు, 12 మంది ఇతరులు విజయం సాధించారు.

పిటిసి, వరంగల్